# నర్సాపూర్ గడ్డ.. గులాబీ అడ్డా

- సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- 9 ఏండ్ల సీఎం పాలనలో కరువు లేదు..కర్ఫ్యూ లేదు..
- సోనియాను బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి...
- ధరణి వద్దనోన్ని బంగాళ ఖాతంలో కలపాలి
- రైతుబంధు, పంట రుణమాఫీ ఇవ్వకుండా ఈసీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్
- ఎన్నికల సంఘం అనుమతి ఇస్తే వారం రోజుల్లో రుణమాఫీ పూర్తిచేస్తాం..
- నర్సాపూర్ ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు



నర్సాపూర్ సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు



మెదక్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : నర్సాపూర్ అంటే గులాబీ జెండా అడ్డా... 2001 నుంచి ఎప్పుడైనా తెలంగాణ కోసం నడుం బిగించిన గడ్డ నర్సాపూర్ అడ్డా.. ఈ సారి నర్సాపూర్‌లో సునీతమ్మను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఏమంటుందో మీరు రోజూ టీవీల్లో చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ధరణి దండగంటున్నది.. కరెంటు వద్దంటున్నారు... రైతుబంధు ఎందుకంటున్నారు.. అధికారం మాత్రం కావాలంటున్నారు... ఇద్దామా.. ధరణి వద్దన్నోన్ని బంగాళాఖాతంలో కలపాలి... రైతుబంధు ఎందుకన్నోన్ని బొందపెట్టాల్సిన అవసరం ఉంది.. 3 గంటల కరెంటు చాలు అన్నోన్ని నర్సాపూర్ పొలిమేరలు దాటేంత వరకు తరిమికొట్టాలి.. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఉచిత కరెంటు అని ఉత్త కరెంటు చేసింది..రేవంత్‌రెడ్డి 10 హెచ్‌పీ పెట్టుకుంటే 3 గంటల్లో పారుతుంది'..అని అంటున్నాడని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నాడు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గురువారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'ఎవరికైనా 10హెచ్‌పీ మోటార్ ఉందా అన్నారు. రైతులకు ఉండేదే 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటార్లు ఉంటాయని, కర్ణాటకలో అనేక కరెంటు కష్టాలు నెలకొన్నట్లు తెలిపారు. అక్కడ అధికారంలోకి వచ్చిన తర్వాత 5 గంటల కరెంటు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో కాగ్రెస్‌కు ఓటు వేస్తే అంధకారమే అని అన్నారు. ప్రతిపక్షాలకు ఎజెండా లేక బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణకు దిశ, దశ అందించే నాయకులు కావాలని, బూతులు మాట్లాడే నాయకులు మనకు ఎందుకు అన్నారు. అన్నివర్గాల ప్రజలు ఇప్పుడు సంతోషంగా ఉంటున్నారని తెలిపారు. సాగు నీళ్లు వచ్చాయని, రెండు పంటలు పండుతున్నాయని, కాంటాలు పెట్టి ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

### సోనియాను బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి

సోనియాగాంధీని బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాట మార్చి కుర్చీ కోసం పాకులాడుతున్నాడని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తాడు. బ్రిటీష్ వాడు దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చిండు అంటామా.. దేశ ప్రజలు పోరాటం చేసి బ్రిటీష్ వారి మెడలు వంచి సాధించారని అంటామని, అలాగే తెలంగాణలో 14 ఏండ్లు కేసీఆర్ సారథ్యంలో ఉద్యమం చేసి తెలంగాణ సాధించినట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

### 9 ఏండ్ల సీఎం కేసీఆర్ పాలనలో కరువు లేదు.. కర్ఫ్యూ లేదు...

సీఎం కేసీఆర్ 9 ఏండ్ల పాలనలో కరువు లేదని.. కర్ఫ్యూ లేదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గత ప్రభుత్వాలు రైతు నుంచి డబ్బులు వసూలు చేస్తే కేసీఆర్ రైతుబంధు ద్వారా రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. రైతు బంధు, వ్యవసాయాన్ని అవమానించిన పీసీసీ అధ్యక్షుడు రేవంతరెడ్డికి ఓటుతో బుద్ది చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలకు పిలుపునిచ్చారు. మిగిలిన పంట రుణమాఫీని పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ అనుమతి కోరామని, అనుమతి వస్తే వారంలో రుణమాఫీ పూర్తి చేస్తామని తెలిపారు. లేదంటే వచ్చేది మన ప్రభుత్వమే అని, డిసెంబర్ 3 తర్వాత చేసుకుందామని చెప్పారు. ఈ ఎన్నికల్లో మంచి మేనిఫెస్టో సీఎం కేసీఆర్ రూపొందించారని, మేనిఫెస్టోలో రూపొందించిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కర్ణాటక ప్రజలు ఎందుకు కాంగ్రెస్‌కు ఓటు వేశామని బాధపడుతున్నట్లు చెప్పారు.

# సునీతాలక్ష్మారెడ్డిని గెలిపిద్దాం

- నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్రాన్ని యావత్ దేశంలో అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దుక్కుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా రెండు సార్లు సీఎం కేసీఆర్ అవకాశం ఇచ్చారన్నారు. నర్సాపూర్‌ను ఎంతో అభివృద్ధి చేశానన్నారు. మంజీరా, హల్దీ వాగులపై 14 చెక్‌డ్యాంలు, బస్సుడిపో, ఫోర్‌లేన్ రోడ్డు తదితర అభివృద్ధి పనులు చేశామన్నారు. సీఎం కేసీఆర్ శిష్యుడిగా మొదటి నుంచి పని చేశానని, ఆయన ఆదేశాల మేరకు బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తానన్నారు. దౌల్తాబాద్, కాసాల గ్రామాలు మున్సిపాలిటీ కావాలని, రంగంపేట గ్రామాన్ని మండలంగా చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు.

# బీఆర్ఎస్‌తోనే నర్సాపూర్ సస్యశ్యామలం

- అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం
- మంజీరా, హల్దీవాగుపై 14 చెక్ డ్యాంలు నిర్మించుకున్నాం
- రైతాంగానికి 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- తనపై నమ్మకంతో టిక్కెట్ ఇచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు
- సీఎం ప్రజా ఆశీర్వాద సభలో నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి



సభలో మాట్లాడుతున్న సునీతాలక్ష్మారెడ్డి

మెదక్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఏవిధంగా అభివృద్ధి చెందాలి.. ఏ విధంగా రైతును, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలి అని ప్రతి వర్గానికి, ప్రతి రంగానికి ఎలాంటి సంక్షేమం అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలో సీఎం ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ బీఆర్ఎస్ సునీతారెడ్డి మాట్లాడుతూ.. పదేండ్ల తెలంగాణలో ప్రతి ఒక్క వర్గానికి చెందిన వారికి సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రైతాంగానికి 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. పంట పెట్టుబడిని ఎవరికీ వారే పెట్టుకుంటారు.. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం కేసీఆర్ రైతుకు రైతు బంధు పథకాన్ని తీసుకొచ్చి పెట్టుబడి సాయం అందిస్తున్నారు. కాళేశ్వరం కాల్వలు నర్సాపూర్ నియోజకవర్గానికి రావాల్సిన అవసరం ఉంది. మంజీరా, హల్దీవాగుపై దాదాపు 14 చెక్ డ్యాంలు నిర్మించుకున్నామని ఆమె గుర్తు చేశారు. ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అయ్యిందన్నారు. ఎండాకాలంలో రైతులు ఈ హల్దీవాగుపై సాగు చేస్తున్న రైతుల పంటలు ఎండిపోకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీరు అందించడంతో ఈ ప్రాంత రైతులు సంతోషంగా ఉన్నారన్నారు.



అమీన్‌పూర్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# పటాన్‌చెరులో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారు
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు

అమీన్‌పూర్, నవంబర్ 16: ప్రతిపక్ష పార్టీల నేతలు ఎన్ని ట్రిక్కులు చేసినా పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని, ముచ్చటగా మూడోసారి గూడెం మహిపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుస్తారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం అమీన్‌పూర్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలవబోతున్నారని, కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారన్నారు. అధికారంలోకి వచ్చాక అమీన్‌పూర్‌కు మెట్రో రైల్‌ను నిర్మిస్తామన్నారు. ఈ ప్రాంతం కొన్నేండ్లుగా ఎంతో అభివృద్ధి చెందుతున్నదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరువు, కర్ఫ్యూలు వస్తాయన్నారు. కాంగ్రెస్ అంటేనే నాటకమని, కర్ణాటకలో 6 గ్యారంటీలు అని చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు అసైన్డ్ భూముల పట్టాలు అందజేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలకు ప్రతి ఇంటికీ సన్న బియ్యం అందిస్తామన్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరికీ అర్థమయ్యేలా చెప్పాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా బీఆర్ఎస్ గాలి వీస్తున్నదని, ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అబద్ధాలకు వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, నిజం నిలకడ మీద తెలుస్తుందన్నారు. 6 గ్యారంటీలు ఏమో కానీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 నెలలకు ఒకరు సీఎం అవడం ఖాయమన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ గులాబీ జెండాలు రెపరెపలాడాలన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం అయి రికార్డు సృష్టిస్తారన్నారు. అప్పుడే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని, అభివృద్ధి ముందుకు సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, పటాన్‌చెరు బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సహకారంతో తనను గెలిపించాలని కోరారు. తనపై నమ్మకంతో సీఎం కేసీఆర్ నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయనని, నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నర్సాపూర్ శాసన సభ్యురాలిగా తనను గెలిపిస్తే నర్సాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గాలి అనిల్‌కుమార్, బీజేపీ నుంచి సింగాయిపల్లి గోపి, సంగారెడ్డి బీజేపీ నాయకుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నందున వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేయాలన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా తనను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో పోరంబోకు భూములు చాలా ఉన్నాయని, పోడు భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని, వాటిని మ్యానిఫెస్టోలో పెట్టారన్నారు. వాటిని పరిష్కరించాలని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. నర్సాపూర్ నియోజకవర్గానికి మరో నాలుగైదు వేల ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.